జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 12-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 669 పేజీలు: 4 వెల: రూ.7

జిల్లా ఆసుపత్రిలో నీటి సమస్యను..
నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదు?

j 36 గంటల్లో నివేదిక ఇవ్వండి j నీటి లభ్యత ఉన్నచోట బోరు వేయండి j ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తే సహించను j మంత్రి అచ్చెన్నాయుడు j బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు j సమయపాలన పాటించని 42 మంది సిబ్బందిపై ఆగ్రహం

టెక్కలి, మే 11 (వార్త): టెక్కలి జిల్లా ఆసుపత్రిలో నీటి సమస్య ఉంటే తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని వైద్యులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. దీనిపై 36 గంటల్లో తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకే ఆకస్మికంగా టెక్కలి జిల్లా ఆసుపత్రికి చేరుకున్న మంత్రి, సుమారు గంటన్నర పాటు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధానంగా వైద్యులు, సిబ్బంది సమయపాలనపై ఆరా తీసిన ఆయన.. విధులకు ఆలస్యంగా వచ్చిన 42 మంది సిబ్బందికి మరోసారి పునరావృతం కాకుండా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, రోగులకు ఇబ్బంది కలగకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఆసుపత్రిలో నీటి లభ్యత ఉన్న చోట వెంటనే కొత్త బోరు తవ్వించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించడంతో పాటు, రోగుల రాకపోకల సౌకర్యార్థం ప్రధాన గేటు వద్ద రెండు మాన్యువల్ గేట్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే కేసులకు సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందించాలని, అత్యవసరమైతేనే జిల్లా కేంద్రానికి రిఫర్ చేయాలని వైద్యులకు దిశానిర్దేశం చేశారు. ఓపీ విభాగాన్ని సందర్శించి రోగులతో మాట్లాడిన మంత్రి.. మరుగుదొడ్ల నిర్వహణ, ఫ్యాన్లు, లైట్లు, లిఫ్ట్ సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. మంత్రి చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ. 20 లక్షల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి సమకూర్చారు. ఇందులో 4 ఆపరేషన్ టేబుళ్లు, 5 మల్టీపారా మానిటర్లు, వీన్ ఫైండర్లు, రోగుల విశ్రాంతి కోసం 20 కుర్చీలను అందజేసి, వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే బాధ్యతారాహిత్య సిబ్బందిపై కఠినంగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మహారాజ్, పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి రూ.20లక్షల విలువైన వైద్య పరీక్షలు

టెక్కలి జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.20 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆసుపత్రి వైద్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన సహకారం అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఆసుపత్రిలోని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి, మెరుగైన సేవలు విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ పరికరాల ద్వారా అత్యవసర వైద్య సేవలు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందుతాయని తెలిపారు. అలాగే ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులు మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చేస్తున్న ఆయన సేవలను అభినందించారు. ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ టెక్కలి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆలయ అభివృద్ధికి
రూ.50లక్షలు

j సీజీఎఫ్ కింద నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం j సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎంజీఆర్ j హర్షం వ్యక్తం చేసిన భక్తులు, కమిటీ సభ్యులు j ఆలయాభివృద్ధికి ఎంజీఆర్‌తో కలిసి కార్యాచరణ j నిధులు విషయంలో ఎంజీఆర్ కృషి చేశారు j కేంద్ర మంత్రి రామ్మోహన్

పాతపట్నం, మే 11 (వార్త): ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల కింద రూ.50 లక్షలు మంజూరు చేసింది. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రత్యేక చొరవతో ఈ నిధులు విడుదల కావడంతో భక్తులు, స్థానికులు, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధి అవసరాలను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి నిధులు మంజూరు కావడంతో ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే ఎంజీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాతపట్నం ఆధ్యాత్మిక వైభవం మరింత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కాగా, పాతపట్నం నీలమణి దుర్గ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయ శాఖ నుండి నలబై లక్షల రూపాయాల నిధులు మంజూరు కావడం శుభపరిణామం అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు విడుదల కావడంతో దేవాదాయ శాఖామంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. నిధుల విషయంలో మామిడి గోవిందరావు చాలా కృషి చేశారని కితాబిచ్చారు.

ప్రతి ఇంటి నుంచి
చెత్త సేకరణ జరగాలి

j పారిశుధ్య నిర్వహణలో.. స్వచ్ఛ రథం సిబ్బంది పాత్ర కీలకం j జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట, మే 11 (వార్త): ఇకపై ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంలో స్వచ్ఛ రథం సిబ్బంది పాత్ర కీలకమని తెలిపారు. సోమవారం నరసన్నపేట ఆర్ అండ్ బీ అతిథి గృహంలో స్వచ్ఛ రథం డ్రైవర్లు, క్లీనర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేవలం చెత్తను సేకరించడమే కాకుండా, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తుల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అంతకుముందు కలెక్టర్ పట్టణంలోని మారుతి నగర్, రెండవ వీధి, కోర్టు భవన సముదాయం తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. కొన్ని చోట్ల చెత్త నిల్వలు పేరుకుపోయి ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం స్థానిక శాసనసభ్యులతో కలిసి కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఉమ్మడిగా పరిశీలించారు. సభా స్థలి, హెలిపాడ్, భద్రతా పరమైన అంశాలపై చర్చించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్ లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, డీపీఓ స్వరూప రాణి, పలు శాఖల అధికారులు, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అనుచరుల కోసమే..
అమరావతి!

j రియల్ ఎస్టేట్ కేంద్రంగా మార్చేశారు j రైతులకు నిలువునా అన్యాయం j ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు గమనించాలి j రాజధాని పేరిట వేల ఎకరాల దోపిడీ j ముందు నుంచి చెబుతున్న వైసీపీ అదే చెబుతుంది j సీఎం చదబ్రాబుపై ఎమ్మెల్సీ నర్తు రామారావు ధ్వజం

ఇచ్ఛాపురం, మే 11 (వార్త): రాజధాని అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాటలే వాస్తవాలు అయ్యాయని శ్రీకాకుళం నియోజకవర్గం స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపార కేంద్రంగా రాజధాని ప్రాంతాన్ని మార్చారని, ప్రజల కలల రాజధాని కాకుండా.. అధికార పార్టీ ల్యాండ్ డిపాజిట్ బ్యాంకుగా మార్చుకున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఆంధ్రజ్యోతి ఎండి వేమూరు రాధాకృష్ణ కుటుంబ సభ్యులకు కేటాయించినటువంటి ప్లాట్లు, చంద్రబాబు నాయుడు అనుచరులకు ఇచ్చిన ప్లాట్ల వివరాలను పరిశీలిస్తున్న అమరావతి ప్రాంత రైతులు నివ్వెరపోతున్నారు. భూములు ఇచ్చినటువంటి రైతులకు ముంపు ప్రాంతాలలోనూ ప్లాట్లు కేటాయిస్తే, చంద్రబాబు నాయుడుకు జాకీలు పెట్టే లేపే వారికి విలువైన కూడళ్లలోనూ, ప్రాంతాలలోనూ, ప్రదేశాలలోనూ ప్లాట్లు కేటాయించి తమ నిజస్వరూపాన్ని బహిర్గతం చేశారని తెలిపారు. ఇప్పుడిప్పుడే రాజధాని రైతులు ఈ భూ మాయ వ్యవహారాన్ని తెలుసుకుంటున్నారని అన్నారు. మరోసారి భూ సమీకరణ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆలోచన చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాన్ని తెలుసుకొని మరోసారి భూములు ఇచ్చి తాము మోసపోకుండా ఉండాలని నిర్ణయానికి వచ్చినట్టు రామారావు స్పష్టం చేశారు. యూరప్ పర్యటన విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి చేరుకున్న తమ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు నష్టపోకుండా పార్టీ త్వరలో మార్గదర్శకాలను విడుదల చేస్తుందని ఎమ్మెల్సీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పులు ఊబిలో కూరిపోయిందని గతంలో పతాక శీర్షికలతో వార్తలు ప్రచురించిన ఆ పత్రికలు ప్రస్తుతం ఎందుకు ఆ వివరాలు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల లోనే దాదాపు నాలుగు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారని, బీద ప్రజలకు ఏమైనా మేలు చేశారా అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను నిలిపివేశారని, రాష్ట్రంలో ఒక్క వితంతువు కైనా నూతనంగా పెన్షన్ మంజూరు చేశారా అని నిలదీశారు. మరి అప్పు చేస్తున్న డబ్బులన్నీ ఎటువైపు మళ్ళీ పోతున్నాయో అంటూ అనుమానాన్ని వ్యక్తం చేశారు. బంగారం లాంటి గత ప్రభుత్వాన్ని కోల్పోయామని, బడుగు,బలహీన వర్గాలకు చెందినటువంటి ప్రజలు ఆవేదన చెందుతున్నట్టు తెలిపారు. వచ్చే ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీ స్థానాలలో గెలుపొంది మళ్లీ పేదల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు. చంద్రబాబు నాయుడు అరాచకాలను అమరావతిలో రైతులే అడ్డుకుంటారని, సరైన సమయంలో తగిన రీతిలో ముఖ్యమంత్రి కి బుద్ధి చెబుతారని శాసనమండలి సభ్యులు అన్నారు.

21 నుంచి 4 వరకూ
ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

j జూన్ 4 వరకూ థియరీ, ఆ తర్వాత ప్రాక్టికల్స్ k 51 కేంద్రాలు సిద్ధం k పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి k జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం, మే11(వార్త): ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీ గా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికా రులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసు కోవాలని ఆయన సూచించారు.సోమవారం ఆయన తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 51 కేంద్రాలలో ఈ పరీక్షలు జరగనున్నాయని, ఇందుకోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జేసీ పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి జూన్ 4వ తేదీ వరకు థియరీ పరీక్షలు, ఆపై ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ నిఘా కోసం అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని జేసీ తెలిపారు. కాపీయింగ్‌కు తావులేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణాలో తపాలా శాఖ సేవలను వినియోగించుకుంటూ అత్యంత జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సౌకర్యార్థం 51 పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ప్రతి కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ ఆర్.ఐ.ఓ, డి.వి.ఇ.ఓ కృష్ణవేణి జిల్లాలో చేసిన ఏర్పాట్లను వివరించారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, ఏపీఈపీడీసీఎల్, పోస్టల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

అన్నప్రసాదానికి బాబా వితరణ

ఆంజనేయ ట్రాలి రిక్షా సంఘం సభ్యులకు 5 వేల రూపాయలు అందజేత

పలాస, మే 11(వార్త): హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం శ్రీ ఆంజనేయ ట్రాలి రిక్షా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి మందిరం వద్ద పలాస రెడ్డిక వీధిలో జరిగే అన్న ప్రసాద కార్యక్రమానికి దైవ కార్యానికి సహాయంగా రూ. 5వేల రూపాయలను అందజేసిన ప్రముఖ సామాజికవేత్త న్యాయవాది దువ్వాడ శ్రీధర్(బాబా). ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి వారి కృపాకటా క్షాలు ఎల్లప్పు దూ పలాస ప్రజలపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ముందుగా ప్రతి ఒక్కరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. జై శ్రీరామ్, హనుమాన్ నినాదాలు చేశారు.

విద్యా ప్రణాళిక షెడ్యూలు

వాయిదా వేయాలి

ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు డిమాండ్

శ్రీకాకుళం, మే 11(వార్త): విద్యా ప్రణాళిక రూపొందించే షెడ్యూలు వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పాఠశాల ఆవాస ప్రాంత, మండల స్థాయి ప్రణాళికలు రూపొందించాలని వేసవి సెలవుల్లో విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కొన్నేళ్లుగా నవంబర్‌లో చేపట్టే ఈ కార్యక్రమాలు ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడానికి వీలుగా వేసవి సెలవుల్లోనే ఐదు రోజుల్లో పూర్తి చేయాలని చెప్పడం తగదన్నారు. అలాంట ప్పుడు ఉపాధ్యాయులను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ముందుగానే ప్రక టించాల్సి ఉందన్నారు. ఒక పక్క ఎన్‌రోల్‌మెంట్, పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు రెమిడీయల్ క్లాసులతో ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ వేసవి సెలవులు తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ పనులను పాఠశాల ప్రారంభం తర్వాత చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

పీఓడబ్ల్యుఏపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- జిల్లా కార్యవర్గం పిలుపు

పలాస, మే 11 (వార్త): ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యు) రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యవర్గం పిలుపునిచ్చింది. సోమవారం బొడ్డపాడు గ్రామంలోని అమరవీరుల స్మారక భవనంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 9వ మహాసభల ప్రచార కార్యక్రమంలో భాగంగా కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ప్రగతిశీల మహిళా సంఘం శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో బొడ్డపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ఈశ్వరమ్మ, పి కుసుమ మాట్లాడుతూ దేశంలో మహిళలపై పెరుగుతున్న హింస, అత్యాచారాలు, గృహహింస, మూఢనమ్మకాలు, వివక్ష, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలపై మహిళలు ఐక్య పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ, ఉపాధి, విద్య, ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. మహిళా హక్కుల సాధన, సమానత్వ సమాజ నిర్మాణం కోసం ప్రగతిశీల మహిళా సంఘం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా మరింత బలమైన ఉద్యమాలు నిర్మించేందుకు రాష్ట్ర మహాసభలు దోహదపడతాయని పేర్కొన్నారు. 2026 మే 23, 24 తేదీలలో గుంటూరులో జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని వారు కోరారు. మహిళలు, విద్యార్థినులు, యువతులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రజిని, లత, ఢిల్లీశ్వరి, స్థానిక మహిళా సంఘ సభ్యులు మోహినమ్మ, వసంత, కుమారి, మహాలక్ష్మి, పద్మ, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

పలాస, మే 11 (వార్త): స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు డిపార్ట్‌మెంట్ డైరెక్టర్, కలెక్టర్ ఆదేశాలననుసరించి ఆధార్ సర్వీసెస్‌కు సంబంధించి స్పెషల్ క్యాంప్‌లను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నామని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటన తెలిపారు. 12వ తేదీ నుంచి 15వరకు, 19 నుంచి 22 వరకు బత్తులవీధి నందు నిర్వహిస్తామన్నారు. సదరు క్యాంప్‌లో కొత్త ఆధార్ నమోదు, 5 -7, 15-17 ఏళ్ల వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేట్, ఆధార్ డాటా అప్‌డేట్ మొదలగు సర్వీసులను అందిస్తారన్నారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు

ఇచ్ఛాపురం, మే 11 (వార్త): శాప్ ఆధ్వర్యంలో స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ వేసవి శిక్షణా శిబిరం ఈ నెల 1 నుంచి నిర్వహిస్తున్నారు. క్రీడాకారులు 40 మందికి పౌష్టిక ఆహారాన్ని కే.శాసనం స్కూల్ పి డి పద్మశ్రీ అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ శిబిరం శిక్షకులు . పద్మనాభం రెడ్డి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హరిపురం 'కన్నా జ్యూయలరీ' ఉదారత

-అంబుగాం ఆదర్శ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

-వినూత్నంగా ముగిసిన 'వేసవిలో వెన్నెల'

మందస, మే 11(వార్త): త'కన్నా జ్యూయలరీ' యజమానులు ఉదారత చూపారు. అంబుగాం ఆదర్శ పాఠశాలకు అహుజా కంపెనీ సౌండ్ సిస్టం అందజేశారు. మండలంలోని అంబుగాం ఆదర్శ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఉపాధ్యాయులు కొనియాడారు.

హరిపురానికి చెందిన ప్రముఖ జ్యూయలరీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొంచాడ జగ్గన్న, ఆయన కుమారులు సత్యవీర్, రఘువీర్‌లు పాఠశాలకు అహుజ కంపెనీ వైర్‌లెస్ సౌండ్ సిస్టమ్‌ను బహుకరించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు ఈ పరికరాలను పాఠశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గున్న రమేష్, దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో విద్యా వికాసానికి జ్యూయలరీ అందిస్తున్న సహకారం మరువలేనిదని, దాతృత్వంలో జ్యూయలరీ మేటి అని పేర్కొన్నారు. గతంలో వారు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా టెస్ట్ పేపర్ల పంపిణీ, ఉపాధ్యాయులకు అవసరమైన క్యారింగ్ బ్యాగులు, మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా మహిళా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు.

ముగిసిన 'వేసవిలో వెన్నెల'

గత నెల ఏప్రిల్ 24 నుండి పాఠశాలలో నిర్వహిస్తున్న 'వేసవిలో వెన్నెల' ప్రత్యేక శిబిరం ముగిసిందని వారు తెలిపారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా, సర్వతోముఖ అభివృద్ధికి బాటలు వేశామన్నారు. విద్యార్థులకు చదువుపై మక్కువ కలిగేలా వినూత్న రీతిలో పాఠాలు బోధించామని, విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఇండోర్ గేమ్స్ నిర్వహించి కళలు, క్రీడలు పట్ల ఆసక్తి కనబరిచారని తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వాలంటీర్ ఉపాధ్యాయులు పర్రి ఈశ్వరరావు, పొందూరు భావన, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన దాతలకు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అపూర్వ కలయిక

-ఈదుపురంలో 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం, మే 11(వార్త): ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1991-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముప్పై ఏళ్ల క్రితం అదే పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన వారు అదే పాఠశాల ఆవరణలో మళ్లీ కలుసుకుని ఆనందంగా గడిపారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమానికి నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, విశ్వనాథం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆత్మీయ సమ్మేళనంలో తమ ఉపాధ్యాయులు టి.నీలయ్య శాస్త్రి, చక్రపాణి ప్రధాన్ జోష్న, లక్ష్మణరావు మాష్టారు, సాయిప్రసన్న, వెంకటరమణ మాస్టర్, నర్తు గంగయ్య మాస్టారును ఘనంగా సత్కరించారు.

ఆలయాలకు నిధులు మంజూరు

సోంపేట, మే 11(వార్త): ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని పలు దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయ శాఖ నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోంపేట మండలం బారువాలో గల శ్రీ జనార్దన స్వామి ఆలయానికి రెండు కోట్లు రూపాయలు, సోంపేట పట్టణంలోని శ్రీ కోదండరామ ఆలయ అభివృద్ధికి 20 లక్షల రూపాయలు, కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయానికి కోటి రూపాయలు, కవిటి మండలం శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి ఆలయానికి 35 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల కావడంతో ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పురాతనమైన ఎంతో విశిష్టత కలిగిన చారిత్రక ఆలయాలు అభివృద్ధి విషయంలో మందగమనంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా దేవాలయాల అభివృద్ధి కమిటీలు గ్రామస్తుల కోరిక మేరకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ మాజీమంత్రి గౌతు శివాజీ విజయవాడలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ఈ దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వారి కోరిక మేరకు సంబంధిత ఇంజనీర్ల ద్వారా అంచనాలు ప్రతిపాదనలు తయారు చేయించి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయడంతో బారువ జనార్ధన స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఏవి రామకృష్ణ, సోంపేట కోదండరామ ఆలయ కమిటీ అధ్యక్షులు బీన ఆనందరావు, పెద్ద శ్రీరాంపురం రామలింగేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు పర్రి వెంకటరమణమూర్తి, వెజ్ పుట్టుక చక్ర పెరుమాళ్ళ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు పొందల కృష్ణారావు ప్రజా ప్రతినిధులకు అలాగే దేవాదాయ శాఖ మంత్రి కి కంచిలి మండలంలో విశేష కృషి చేస్తున్న టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

మందస, మే 11(వార్త): పిడిమందసలో వైభవంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం జరిగింది. శ్రీవైద్యనాథ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 4వ వార్షికోత్సవం సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ముందుగా స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం తిరువీధులను ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. మందస, పలాస, సోంపేట, వజ్రపుకొత్తూరు తదితర మండలాల నుంచి భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీవైద్యనాథ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాలతీర్థపు గోపాలష్ణ, కార్యదర్శి సిరిపురం సంతోష్ కుమార్, గౌరవ అధ్యక్షుడు వజ్రాల వెంకటరమణ, భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఆధ్యాత్మికవేత్త పొందర దుదిష్టిపాత్రో, నటరాజ్ టైలర్స్ ఎస్.విజయ్ కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి ఫెయిల్ విద్యార్థులకు రెమిడీయల్ క్లాసులు

నరసన్నపేట, మే 11 (వార్త): నరసన్నపేటలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేకంగా రెమిడీయల్ క్లాసులు నిర్వహిస్తున్నామని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. మొత్తం 87 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని, వీరికి ఆయా ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రత్యేక బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు శశికళ ఆధ్వర్యంలో రెమిడీయల్ క్లాసులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి తదుపరి పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేలా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా తరగతులకు హాజరవ్వాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

నరసన్నపేటలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

-పారిశుధ్యంపై ఆదేశాలు

నరసన్నపేట, మే 11 (వార్త): నరసన్నపేటలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఉదయం స్థానిక మారుతి నగర్ రెండో వీధి, కోర్ బిల్డింగ్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించిన కలెక్టర్ పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా పరిశుభ్రతను కాపాడాలని అధికారులను ఆదేశించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో చెత్త నిల్వలు కనిపిస్తున్నాయని, వాటిని వెంటనే తొలగించి త్వరితగతిన పారిశుధ్య పనులు పూర్తి చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జడ్పీ సీఈఓ వెంకట్రామన్, డీపీఓ స్వరూప రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

దటీజ్ ఈజ్

డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస, మే 11(వార్త): డాక్టర్ సీదిరి అప్పలరాజు.. ఆయనో యూత్ ఐకాన్. రాజకీయ ఆరంగేట్రం చేసిన కొద్ది రోజుల్లోనే ఏకంగా రాష్ట్రంలోనే మంత్రి పదవి సాధించారు. ప్రజల్లో, పార్టీలో మంచి పేరు సాధించారు. ప్రధానంగా ఆయన వాగ్ధాటి.. చాతుర్యం.. డేరింగ్ అండ్ డేషింగ్.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్రెడ్డికి అత్యంత సన్నిహితుని చేశాయి. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అప్పలరాజు అందరివాడుగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా యువతకు అప్పలరాజు ఆరాధ్యునిగా నిలిచారు. ప్రతీ ఒక్కరికీ పేరు, పేరున పిలిచి, బాగున్నారా అంటూ పలకరించే ఆయన పల్లెల్లో పర్యటిస్తే.. చాలు ప్రతీ ఒక్కరూ ఆయనను ఓ స్నేహితునిలా చూస్తారు. కపటంలేని ఆయన నవ్వు ప్రతీ ఒక్కరినీ ఆకర్షిస్తుంది. ఈ తరుణంలో మందస మండలంలోని జిల్లుండలో జరుగుతున్న శ్రీపాలపోలమ్మతల్లి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ వెళ్లి.. అందరి ఆప్యాయతలను అందుకున్నారు. యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్ తో కలసి ద్విచక్ర వాహనంపై పర్యటించి, అందరినీ ఆకట్టుకున్నారు. సుమారు గ్రామంలో ప్రతీ ఇంటికీ వెళ్లి.. అందర్నీ ఆశ్చర్యచకితులను చేశారు. మాజీ మంత్రిగా, మంచి వైద్యునిగా డాక్టర్ అప్పలరాజు ఉత్సవాల్లో పాల్గొని, సామాన్యునిలా అందరితో కలియ తిరుగుతూ..

తడి-పొడి చెత్తపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

నరసన్నపేట, మే 11 (వార్త): తడి, పొడి చెత్త నిర్వహణపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం చమల్ల గోవిందరాజులు సూచించారు. సోమవారం నరసన్నపేట పట్టణంలోని బొడ్డవలస వీధిలో మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఇంటి వద్దే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచాలని తెలిపారు.

ప్రతిరోజూ ఉదయం విజిల్ వేస్తూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వస్తారని, వారికి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు చేరిక

నరసన్నపేట, మే 11 (వార్త): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు నరసన్నపేటకు చేరుకున్నాయని ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తెలిపారు.

సోమవారం వచ్చిన ఈ కిట్లను నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలలో భద్రపరుస్తామని వారు వెల్లడించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అవసరమైన పాఠ్యపుస్తకాలలో సుమారు 80 శాతం మేరగా 20,046 పుస్తకాలు వచ్చినట్లు వివరించారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరలో చేరనున్నాయని తెలిపారు. జూన్ మొదటి వారంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరానికి ముందుగానే ఏర్పాట్లు చేపడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

తెలగ వీధిలో చెత్త నిల్వలు..!

- పారిశుధ్య లేమిపై

స్థానికుల ఆందోళన

నరసన్నపేట, మే 11 (వార్త): నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని తెలగ వీధిలో చెత్త నిల్వలు పేరుకుపోతుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పెద్దపేట ప్రాంతంలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నరసన్నపేట పట్టణంలో వందలాది మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నప్పటికీ చెత్త నిల్వలు తగ్గడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్త తొలగింపు చర్యలు చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా గ్రంథాలయాలు నిర్వహించాలి

-గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పీరికట్ల విఠల్ రావు

మందస, మే 11(వార్త): ప్రజలకు ఉపయోగపడేలా గ్రంథాలయాలు నిర్వహించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పీరికట్ల విఠల్ రావు అన్నారు. మందస పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు మరింత పాఠకుల వచ్చేలా చేయాలని సూచించారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాయాలని, ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకు జరుగుతున్న ప్రత్యేక వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలను, వాటి పనితీరును స్థానిక లైబ్రేరియన్ జె.విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. వేసవి శిక్షణ తరగతులు చక్కగా జరుగుతున్నాయని, భవిష్యత్తులో గ్రంథాలయాలు జిల్లా పెద్దల సహకారంతో పూర్తిస్థాయి అభివృద్ధి చేయడానికి తగిన కార్యాచరణ రూపకల్పన చేయడం జరుగుతోందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు గ్రంథాలయాల అభివృద్ధి సహకరించాలని కోరారు.

అక్రమంగా గోవుల రవాణా.. వాహనం స్వాధీనం

నరసన్నపేట, మే 11 (వార్త): అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి. గణేశ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నరసన్నపేట మండలం శివరామపురం గ్రామం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఈ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. నారాయణవలస సంత నుంచి విజయనగరం జిల్లాకు తొమ్మిది పశువులతో వెళ్తున్న వ్యాన్‌ను అడ్డుకున్నట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా గోవులను తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం గోవులను సమీప గోశాలకు తరలించినట్లు వెల్లడించారు. పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

తిలారు రైల్వే స్టేషన్ భూములపై ఆక్రమణల ఆరోపణలు

జలుమూరు, మే 11 (వార్త): తిలారు రైల్వే స్టేషన్‌కు చెందిన భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారి పక్కన ఉన్న కొంతమంది ఇంటి యజమానులు రైల్వే స్థలాల్లో దర్జాగా పునాదులు వేసి సొంత ఆస్తులుగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో భయంతో ఎవరూ ముందుకు రాకపోయినా, ప్రస్తుతం ఎలాంటి భయం లేకుండా ఆక్రమణలు కొనసాగుతున్నాయని స్థానికులు అంటున్నారు. రైల్వే శాఖ భూములు క్రమంగా ఆక్రమణలకు గురవుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయాల్లో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

సారవకోట, మే 11 (వార్త): సారవకోట మండలంలో గత ప్రభుత్వం హయాంలో సచివాలయాలకు అందించిన ఫాగింగ్ యంత్రాలు ప్రస్తుతం వినియోగం లేక మూలకు చేరినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఈ యంత్రాల్లో ప్రత్యేక లిక్విడ్ నింపి ఫాగింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, చాలా ప్రాంతాల్లో అవి ఉపయోగించకుండా పక్కన పెట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసవి, వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది ఈ యంత్రాల వినియోగంపై సరైన దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎంపీడీవో మోహన్ కుమార్ ను వివరణ కోరగా, పంచాయతీ కార్యదర్శులకు తగిన ఆదేశాలు జారీ చేసి ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచిస్తామని తెలిపారు

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

శవ పరీక్ష గది పునర్నిర్మించాలి

నరసన్నపేట, మే 11 (వార్త): నరసన్నపేటలోని రాతికర్ర చెరువు సమీపంలో ఉన్న శవపరీక్ష గది శిథిలావస్థకు చేరుకుందని, దానిని తక్షణమే పునర్నిర్మించాలని బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'జనతా వారధి' పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఈ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం శవపరీక్ష గది దయనీయ పరిస్థితిలో ఉండటంతో వైద్యులు, ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారే అవకాశం ఉందని, కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్యం, వైద్య సేవల దృష్ట్యా వెంటనే స్పందించి కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు.

లగేజ్ ఆటోలో ప్రమాదకర ప్రయాణం

-నిబంధనల ఉల్లంఘనపై ఆందోళన

నరసన్నపేట, మే 11 (వార్త): నిబంధనలను గాలికి వదిలేసి ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్న ఘటన నరసన్నపేటలో శనివారం కనిపించింది. లగేజ్ ఆటోలో ఏకంగా 20 మందికి పైగా మహిళలను తరలిస్తున్న ఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ప్రయాణికుల రవాణాకు అనుమతి లేని లగేజ్ ఆటోల్లో పరిమితికి మించి ప్రజలను తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. చిన్నపాటి ప్రమాదం జరిగినా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించవద్దని పోలీసులు పలుమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ కొంతమంది వాహనదారులు వాటిని పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణుల సంఘానికి ఉచిత కిట్లు

జలుమూరు, మే 11 (వార్త): దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రం శ్రీముఖలింగం గ్రామంలో పలు దశాబ్దాలుగా సేవలందిస్తున్న నాయిబ్రాహ్మణుల సంఘానికి రిటైర్డ్ కమ్యూనికేషన్ సీఐ, సోషల్ వర్కర్ సూరా రామ సూర్యారావు ఉచిత కిట్లను పంపిణీ చేశారు. స్వర్గీయ వెంకటప్పుడు మాస్టర్ జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణులను దుస్సాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకుని తన వంతు సహాయం అందిస్తానని సూర్యారావు హామీ ఇచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు సహాయం చేయడం నిజమైన సామాజిక న్యాయం అని గ్రామ పెద్దలు, స్థానికులు కొనియాడారు. నాయిబ్రాహ్మణులు కూడా సూర్యారావు సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖలింగేశ్వర దేవాలయ పూజారుల సంఘం వ్యవస్థపాక అధ్యక్షుడు నాయుడుగారి రాజశేఖర్, సింహాచలం, మాజీ ఉప సర్పంచ్ గుంట కర్ణవీడు, ఇంజనీర్ సింహాచలం, గ్రామ పెదాలు తదితరులు పాల్గొన్నారు.

వంశధార ఎడమ ప్రధాన కాలువ గట్ల

ఆక్రమణలపై ఆందోళన



జలుమూరు, మే 9 (వార్త): జలుమూరు మండలం రానా ప్రాంతంలో వంశధార ఎడమ ప్రధాన కాలువ గట్లు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు రక్షణగా ఉండాల్సిన గట్లను కొంతమంది అక్రమిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఆక్రమణలను చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కాలువ గట్ల భద్రత ప్రమాదంలో పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కాలువ గట్లు దెబ్బతింటే సాగునీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు వచ్చిన సమయంలో గట్లు బలహీనపడే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి కాలువ గట్లను పరిరక్షించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

భూసారం పెంపునకు నవ ధాన్యాల సాగు

సోంపేట, మే 11 (వార్త): భూసారం పెంచి పంట దిగుబడులు సాధించేందుకు ముందుగా నవధాన్యాల సాగు చేయడం ఎంతో అవసరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మండలం బేసి రామచంద్రపురం గ్రామంలో తయారుచేసిన నవధాన్యాల కిట్స్ ను సోమవారం పరిశీలించారు. వీటి ప్రయోజనాలు గూర్చి రైతులకు వివరించారు. వాతావరణ పరిస్థితుల దృశ్య అనుసరించాల్సిన వ్యవసాయ విధానాలు గూర్చి వివరించారు. వచ్చిరొట్ట ద్వారా నేలకు నత్రజని అందుతుందని అటువంటి విత్తనాలు ప్రస్తుతం వేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు బాగా తగ్గించుకొని నేలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుమారి శివాజీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం కలెక్టర్ గ్రీవెన్స్‌కు!

సోంపేట, మే 11 (వార్త): సోంపేట మండలంలో గత నెలలో కురిసిన వడగండ్ల వానకు వివిధ పంటలు పూర్తిగా నేలపాలయ్యాయి. ముఖ్యంగా జింక్ భద్ర బెంకిలి పలాసపురం గ్రామాల పరిధిలో సుమారు 420 ఎకరాలలో టమాట పంట ఘోరంగా దెబ్బతిని 300 మందికి పైగా రైతులు నష్టపోయారు. అలాగే ఈ ప్రాంతంలో సుమారు 170 ఎకరాల్లో కట్టె జనుము పంట కూడా నష్టపోయింది. ఉద్యాన శాఖ వ్యవసాయ శాఖలు సర్వే చేపట్టి పంట నష్టాన్ని రైతులను గుర్తించడం జరిగింది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రైతు సంఘ ప్రతినిధులు మరియు మహాత్మా జ్యోతిరావు పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు ఆధ్వర్యంలో పలువు రైతులు సోమవారం శ్రీకాకుళంలో కలెక్టర్ గ్రీవెన్స్ కు హాజరయ్యారు. రైతుల ఆవేదన ఆందోళనతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి వీలైనంత త్వరగా నష్టపరిహారం రైతులకు చెల్లించాలని కోరారు. రైతులకు కష్ట కాలంలో సహాయం చేయకపోతే భవిష్యత్తులో వ్యవసాయం పట్ల రైతాంగం విముఖత చూపిస్తుందని గుర్తు చేశారు. అలాగే సోంపేట కంచిలి మండలాలకు ప్రధాన సాగునీటి వనరైన పైడిగం ప్రాజెక్టు మరమ్మతులకు గురైందని మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ప్రస్తుతం ఉందని మరో వినతి పత్రాన్ని అందజేశారు. మరమ్మత్తులు చేయని యెడల వచ్చే ఖరీఫ్ సాగు కష్టతరంగా మారుతుందని గుర్తు చేశారు. తొందరగా నిధులు మంజూరు చేసి పైడిగా ప్రాజెక్టును పట్టిష్టపరిచి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కప్పగోపి, తామాడ అప్పలస్వామి కాళ్ళ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

చెవిటమ్మ తల్లి పండగ సేవకుడికి ఘన సన్మానం

సారవకోట, మే 11(వార్త): సారవకోట మండలం అవలింగి గ్రామంలో ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన శ్రీశ్రీశ్రీ గ్రామదేవత చెవిటమ్మ తల్లి ఘటాల పండగ మహోత్సవంలో సేవలందించిన ధర్మాన తేజ్ కుమార్ ను గ్రామదేవత ఘటాల పండుగ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. పండగ ఏర్పాట్లలో భాగంగా కమిటీ సభ్యులతో నిరంతరం సమన్వయం చేస్తూ ఏర్పాట్లను సమీక్షించిన తేజ్ కుమార్, పండగ సందర్భంగా కమిటీ సభ్యులకు ఏకరూప టీ-షర్ట్ దుస్తులను అందజేశారు. అదేవిధంగా జేసీబీ ద్వారా ఆలయ ప్రాంగణం, రహదారులను బాగుచేయించడంతో పాటు భక్తులకు ఆర్ఓ నీరు, చల్లని మజ్జిగ పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయన సేవలను అభినందిస్తూ సన్మానం నిర్వహించారు. గ్రామ పండుగలను విజయవంతంగా నిర్వహించడంలో ఆయన అందించిన సహకారం ప్రశంసనీయమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బోర ధనుంజయ్, కింజరాపు జగదీశ్, బోర శ్రీనివాస్, బోర సురేష్, ముద్దాడ లక్ష్మణరావు, సోనేనా శ్యామ్, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షులు పిళ్ళా నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణలు తొలగించాలి : జేసీ

నరసన్నపేట, మే 11 (వార్త): నరసన్నపేట మార్కెట్, కళాశాల రహదారి ప్రాంతాల్లో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ సోమవారం ఉదయం పర్యటించి రహదారుల ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుపై వ్యాపారాలు నిర్వహిస్తున్న షాపు యజమానులను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లోపల ఉన్న పంచాయతీ షాపుల్లోనే వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం జమ్ము జంక్షన్ ప్రాంతాన్ని సందర్శించిన జేసీ, రహదారిని ఆక్రమించి నిర్వహిస్తున్న పండ్ల దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్లను ఆక్రమించుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారులు నిబంధనలు పాటించాలని, రహదారులపై ఆక్రమణలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమాన్పాద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలి

కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి

పలాస, మే 11 (వార్త): అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కాశీబుగ్గ ఎస్ ఐ అర్ నరసింహమూర్తి ప్రజలను కోరారు. టెక్కలిపట్నం గ్రామ సందర్శనలో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించారు. కాశీబుగ్గ ఎస్ ఐ మాట్లాడుతూ నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలు, ఆప్షన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయోగం, మొదలైన వాటి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాశిబుగ్గ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546